# మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించండి

- సీఎం కేసీఆర్ సహకారంతో గద్వాలను అభివృద్ధి చేశా
- మరో సారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా..
- గద్వాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల/అలంపూర్, నవంబర్ 6 : గతంలో మీరు ఆశీర్వదించడం వల్లే నేను గద్వాల ఎమ్మెల్యేగా గెలిచానని నన్ను మరోసారి ఆదరించాలని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం అయిజ రహదారిలోని తెలంగాణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదసభలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో గద్వాలను ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. మీ అండే నాకు కొండత ధైర్యమని మీరు ఉన్నంత వరకు నన్ను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. గతంలో చాలా సంవత్సరాలు గద్వాలను కాంగ్రెస్, టీడీపీ నాయకులు పరిపాలించారని అయితే వారి కాలంలో అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాను సాధించుకున్నామని అనంతరం గద్వాల నియోజకవర్గాన్ని విడుతల వారీగా అభివృద్ధి చేసుకుంటు వస్తున్నామన్నారు. మరోసారి మీరు ఆశీర్వదిస్తే గద్వాలను మరింత అభివృద్ధి చేస్తానని, ఈ నెల 30న జరిగే ఓటింగ్‌లో ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నాకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, రాజారెడ్డి, జెడ్పీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, శ్యామల, పీఏసీసీస్ చైర్మన్లు వెంకటేశ్, సుభాన్, సర్పంచ్ బండ్లజ్యోతి తదితరులు ఉన్నారు.

### ప్రభంజనం ఖాయం

అయిజ, నవంబర్ 6 : స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు నడిగడ్డ ప్రజలను వలస జీవులుగా మార్చి గత 60 ఏండ్లుగా గద్వాలను పాలించిన కుటుంబం ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెనుకాడడం చూస్తుంటే బీఆర్‌ఎస్ పార్టీ ప్రభంజం సృష్టించడం ఖాయమని వినియోగదారులు ఫోరం రాష్ట్ర చైర్మన్ గట్టు తిమ్మప్ప అన్నారు. నడిగడ్డలో రెండు జీవనదులు ప్రవహిస్తున్నా అన్నమో రామచంద్ర అంటూ వలసలు వెళ్లి జీవనం సాగించారన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితిని తీసుకొచ్చింది కాంగ్రెస్ పాలకులన్నారు. నడిగడ్డకు సాగు, తాగునీరు అందించి సీఎం కేసీఆర్ మహానుభావుడయ్యాడన్నారు. గట్టు భీముడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే నెట్టెంపాడు ప్రాజెక్టుకు రూపకల్పన జరిగిందన్నారు. నడిగడ్డను ఎండబెట్టి సీమాంధ్రకు నీళ్లు తీసుకెళ్లిన రాయలసీమ నాయకులకు హారతులు పట్టిన ఘనత మన ప్రాంతానికి చెందిన నాయకులకుందన్నారు. గద్వాలలో మతతత్వ పార్టీలకు స్థానం లేదన్నారు. గద్వాలలోని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు.

### టూరిస్టులను తరిమికొట్టాలి


శంషాబాద్ ప్రాంతం నుంచి గద్వాల తరలివచ్చిన టూరిస్టులను తరిమి కొట్టాలని ఎమ్మెల్యే సతీమణి, బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి గద్వాల ప్రజలను కోరారు. సబ్బండ వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కష్టపడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల పట్ల ఆప్యాయత అనురాగాలు పంచుతున్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఆదరించాలన్నారు. పొలిటికల్ టూరిస్టులు వస్తూ.. పోతూ ఉంటారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్లబొల్లి కబుర్లు చెప్పి బురిడి కొట్టిస్తారని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి మంచి నాయకుణ్ణి గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్ అడుగు జాడల్లో నడుస్తూ గద్వాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రజలు గొప్ప ఆదరణ పొందుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని కోరారు.

### సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే బండ్ల

గద్వాల అర్బన్, నవంబర్ 6 : సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలో ప్రజా ఆశీర్వాదసభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ క్రమంలో హెలిప్యాడ్ వద్ద గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా హెలిప్యాడ్ నుంచి వస్తున్న సీఎం కేసీఆర్‌ను చూసిన నడిగడ్డ ప్రజానీకం అభివృద్ధి ప్రధాత, 24 గంటల కరెంట్ ఇచ్చిన గొప్ప వ్యక్తి అంటు నినాదాలు చేస్తు ఘనంగా స్వాగతం పలికారు.

# కరువును తరిమిన దైవం సీఎం కేసీఆర్

- ప్రజలకు కృతజ్ఞుడినై ఉంటా..
- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల

మూసాపేట, నవంబర్ 6 : పాలమూరు ఎంపీగా ఎన్నప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ మన గోసలు చూసిండని, సీఎం అయిన వెంటనే అడిగిన వెంటనే నిధులు మంజూరు చేస్తూ కరువును తరిమిన దైవం మన కేసీఆర్ అని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కొనియాడారు. సోమవారం దేవరకద్రలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాదసభలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఈ ప్రాంత ప్రజలను ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. వాగులు, వంకలు, చెరువులు కుంటలు అన్నీ ఎండిపోయి మనుషులకు, జంతువులకు కూడా తాగునీరు ఉండేది కాదన్నారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీర్వాదంతో చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులు, కాల్వలు, రోడ్లు, భవనాలు ఇలా చెప్పుకుంటూ పోతే అనుకున్న దానికంటే ఎక్కువనే అభివృద్ధి చేసినట్లు చెప్పారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు సాగునీటికి చెక్‌డ్యాంల నిర్మించుకోవడం వలన పుష్కలంగా పంటలు పండించుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి పల్లె నేడు సస్యశామలం అయ్యిందని, కరువుపోయి మన వద్దకు ఇతర రాష్ట్రాల నుంచి బతకడం కోసం కూలీలు వస్తున్నారని గుర్తు చేశారు. మీమీ గ్రామాల్లో నేను చేసిన అభివృద్ధిని, ప్రభుత్వం ద్వారా అందుకున్న సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుకు ఓటు వేసి మరో మారు రెట్టింపు మెజార్టీతో గెలిపిస్తే దేవరకద్రను మరింత అభివృద్ధి చేసుకుందామని ప్రజలను సూచించారు. ఎల్లప్పుడూ మీకు కృతజ్ఞుడై ఉంటూ మీ సేవ చేస్తానని సభాముఖంగా ప్రకటించారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధిని కల్పించాలని కోరారు. అదేవిధంగా కౌకుంట్లలో నుంచి అడ్డాకుల వరకు డబుల్ రోడ్డు, వంతెన నిర్మాణానికి నిధులు మం జూరు చేయాలని, దేవరకద్రలో పాల్‌టెక్నిక్ కళాశాల మంజూరు చే యాలని, కురుమూర్తిస్వా మి ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, అదేవిధంగా నియోజకవర్గంలోని ఆయా మండలాలకు సం బంధించి కావాల్సిన వాటిని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరారు. అందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందిస్తూ మీ చెక్‌డ్యాంల ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని 50 వేల మెజార్టీ తగ్గకుండా గెలిపించాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే మంజూరు చేసుకుందామని చెప్పారు.

### సీఎం కేసీఆర్‌కు ఆల స్వాగతం

దేవరకద్ర, నవంబర్ 6 : ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరకద్ర నియోజవర్గకేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఎం కేసీఆర్ హెల్‌ప్యాడ్‌లో దేవరకద్రకు చేరుకోగానే మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎంపీ మన్నే శ్రీనిస్‌గౌడ్, మాజీ స్పీకర్ మదుసూదనాచారి, మాజీ మంత్రులు నాగం జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.

# సీఎం కృషితోనే భీమాను సాధించుకున్నాం

- దేవుడి ఆశీర్వాదంతో సీఎం కేసీఆర్ మక్తల్‌కు వచ్చారు
- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, నవంబర్ 6 : గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పెండింగ్‌లో ఉన్న భీమా ప్రాజెక్టును తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కృషి, సహకారంతో సాధించుకున్నామని, ఈ రోజు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు సాధించుకున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రజాఆశీర్వదసభ నిర్వహించగా సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం మాట్లాడుతూ ఐదేండ్ల కిందట ఇదే ప్రాంతో ఇదే స్థలంలో మక్తల్ పట్టణానికి వచ్చి సీఎం కేసీఆర్ సారు ఇదే ప్రాంతంలో ఇదే వేదికపై మాట్లాడారు. ఈప్రాంత సమస్యలను ఎప్పుడు తనవద్దకు తీసుకువెళ్లినా సానుకూలంగా స్పందించారు. సీఎం కృషి వల్లనే మక్తల్‌లో భీమా ప్రాజెక్టులో అ ంతర్భాగమైన సంగంబండ, భూత్పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్లను పూర్తి చేసుకొని నియోజకవర్గంలో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అదే విధంగా మక్తల్ పట్టణంలో పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి 150 పడకల దవాఖానను మంజూరు చేశారని, అలాగే డిగ్రీ కళాశాలతోపాటు ఆరు రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా భూత్పూర్, సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్లలో ముంపునకు గురైన నేరడి గొమ్ము, భూత్పూర్ గ్రామాలకు ఇండ్లకు సంబంధించి నష్ట పరిహారం, ఆర్ ఆర్ సెంటర్ల ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. అలాగే సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయిర్ నుంచి ఉట్కూర్ పెద్ద చెరువును నింపాలని, మక్తల్ పట్టణానికి ఉర్దూ మీడియం కళాశాలను ఏర్పాటు చేయాలని, మక్తల్ పట్టణంలో బస్సుడిపో ఏర్పాటు చేయాలని, చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని, మక్తల్ మండలంలోని ప్రసిద్ధి చెందిన దత్తాత్రేయ స్వామి ఆలయం వద్ద కృష్ణానదిపై రూప్‌వే బ్రిడ్జి మంజూరు చేయాలి చేయాలని మందిపల్లి – గజరన్‌దొడ్డి గ్రామాల మధ్య బ్రిడ్జి మంజూరి చేయాలని, సీఎంను కోరారు.

### దేవుని ఆశీర్వాదంతోనే సీఎం మక్తల్‌కు వచ్చారు


దేవుని దయ వల్ల ఈరోజు మక్తల్ పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ సారు వచ్చారని, హైదరాబాద్‌లో బయలుదేరిన హెలిక్యాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో మరో హెలీక్యాప్టర్‌లో మక్తల్ పట్టణంలో ప్రజా ఆశీర్వాద సభకు ఆలస్యంగా నైనా వచ్చారన్నారు. హెలీక్యాప్టర్‌లో సాంకేతిక లోపం వచ్చిన విషయం తెలియగానే ఎంతో టెన్సన్ పడ్డమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి భావోద్వేగంతో మాట్లాడారు. ఉదయం నుంచి ఎంతో ఓపికతో వివిధ గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, శాట్ చైర్మన్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉచిత హామీలతో ప్రజలను మోసం చేశారని వారి జిమ్మిక్కులు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాసురెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్‌పర్సన్ రజని, రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యురాలు చిట్టెం సుచరితారెడ్డి, మక్తల్ ఎంపీపీ వనజ, ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, మాజీ ఎంపీపీ శ్రీధర్ గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్లు నరసింహాగౌడ్, రాజేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

### సీఎంకు చిట్టెం స్వాగతం

మక్తల్‌టౌన్, నవంబర్ 6 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మక్తల్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో భాగంగా మక్తల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదసభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు సీఎం కేసీఆర్‌కు హెల్‌ప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

# సాగునీరు తీసుకొస్తే నా జన్మసార్థకం

- ప్రజా ఆశ్వీరాద సభలో నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్‌ఆర్‌రెడ్డి

నారాయణపేట, నవంబర్ 6 : గత ఎన్నికల సందర్భంగా రాజేందర్‌రెడ్డిని గెలిపిస్తే జిల్లా చేస్తానని ప్రకటించిన విధంగానే ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే జిల్లాగా చేసిన ప్రధాత సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా సీఎం కేసీఆర్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు రామ్మోహన్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు తీసుకొస్తే తన జన్మ సార్థకం అవుతుందని చెప్పారు. జిల్లా ఏర్పాటు వల్ల ఈ ప్రాంత ప్రజలు సీఎం కేసీఆర్‌కు ఎంతో రుణపడి ఉంటారన్నారు. ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించడానికి ప్రజలు ఈ సభకు వచ్చారన్నారు. ఎంత పని ఉన్నా మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జనం ఓపికతో ఉన్నారని తెలిపారు. జిల్లా ఇచ్చిన తర్వాత ఎంతో అభివృద్ధి జరిగిందని, ఈ సారి కూడా ప్రజల నుంచి కొన్ని డిమాండ్లు ఉన్నాయన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల మెయిన్ కెనాల్ ద్వారా కాల్వలను తవ్వించి 7,8 నెలల్లో నీరు పారించాలన్నారు. దామరగిద్ద మండలం కాన్‌కుర్తి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తే కొడంగల్, దామరగిద్ద ప్రాంతానికి సాగునీరు అందుతుందన్నారు. కొత్తగా ఏర్పడిన నారాయణపేట జిల్లాకు రింగురోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చెందుతుందన్నారు. రూ.10కోట్లతో నారాయణపేటలో బాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను మంజూరు చేయాలని కోరారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను ఈ ఏడాది నుంచి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఎకో పార్క్ వద్ద 50 ఎకరాలు కేటాయించడం జరిగిందని అందులో అగ్రికల్చర్ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్నారు. కేసీఆర్ కళాభవన్‌ను మంజూరు చేయాలని కోరారు. మరికల్‌లో కైటెక్స్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయాలని, జిల్లా ఏర్పడినందున హజ్‌హౌస్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ముదిరాజ్ ముద్దుబిడ్డల కోసం రూ.2కోట్లతో రెండు ఎకరాల్లో ముదిరాజ్ భవనం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ఎర్రశేఖర్, ఇందిర, ఎన్నికల ఇన్‌చార్జి దేవరి మల్లప్ప, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య, జెడ్పీ వైస్‌చైర్మన్ సురేఖారెడ్డి, ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడి పాల్గొన్నారు.

### సీఎంకు ఘన స్వాగతం

నారాయణపేటరూరల్, నవంబర్ 6 : జిల్లా కేంద్రంలోని జరిగిన ప్రజా ఆశీర్వాదసభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెల్‌ప్యాడ్‌లో మక్తల్ నుంచి నారాయణపేటకు వచ్చిన సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానిక ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.